క్లుప్తంగా

భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



భోగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని ఎర్రమల కొండల్లో కొలువైన శ్రీ దుర్గా, భోగేశ్వర స్వామి వారికి ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ, గిరినాథశర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిగాయి. భక్తులు భక్తి శ్రద్ధలతో అభిషేకం, అర్చనలు చేశారు.

పంటలను పరిశీలించిన ఏఓ



ముదుమాలలో కందిపంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల పరిధిలోని నదీతీర గ్రామాల్లో గురువారం ఏఓ మల్లేష్‌కుమార్ పర్యటించారు. కొత్తకోట, ఈర్లదిన్నె, ముదుమాల గ్రామాల్లో పర్యటించిన ఏఓ రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. కొత్తకోట గ్రామంలో పత్తిపైరును పరిశీలించి పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అదేవిధంగా ఈర్లదిన్నెలో వరి, ముదుమాల గ్రామంలో కంది పంటను ఏఓ పరిశీలించారు. అదేవిధంగా వీఏఏ గ్రామంలో చేపట్టిన ఈ పంట నమోదును తనిఖీ చేసి ఈ పంట నమోదు చేకూరే లబ్ధిని రైతులకు వివరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు షరీఫ్, నాగన్న, ఎంపీఈఓ వెంకటేష్, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు రక్తహీనతపై జాగ్రత్తలు తీసుకోవాలి



మహిళలతో సమావేశమైన సూపర్‌వైజర్లు

సి.బెళగల్: గర్భిణులు రక్తహీనత సమస్యలు రాకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సి.బెళగల్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు మద్దిలేటి, మంగమ్మలు సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్ ఒకటవ గ్రామ సచివాలయంలో గర్భిణులు, బాలింతలు, మహిళలతో వారు సమావేశం నిర్వహించి ఆరోగ్య సూత్రాలు సూచించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా ఎంఎల్‌హెచ్‌పీ ప్రభావతి బాల్య వివాహాలు, ఆరోగ్య సమస్యలు, నిలువరించాల్సిన పద్ధతులపై మహిళలకు అవగాహన కల్పించారు.

అదుపుతప్పి గోతిలో పడిన టిప్పర్



కె.సింగవరం దగ్గర గుంతలో పడిన టిప్పర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండలంలోని కె.సింగవరం గ్రామ శివారులో గురువారం రాత్రి టిప్పర్ అదుపుతప్పి గోతిలో పడింది. కె.సింగవరం ఇసుక రీచ్‌కు కర్నూలు నుంచి వచ్చిన టిప్పర్ డ్రైవర్ రోడ్డుపై రివర్స్ చేస్తున్న సందర్భంలో యూపీ పాఠశాల సమీపంలో రోడ్డు పక్కనున్న గోతిలోకి పడిపోయింది. టిప్పర్‌లో ఉన్న డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. గురువారం ఉదయం జేసీబీ సాయంతో టిప్పర్‌ను బయటకు తీశారు.

యుక్త వయసులోనే వివాహాలు చేసుకోవాలి



బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేసుకోవాలని కోడుమూరు కోలోకెటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మధన్‌శేఖర్ సూచించారు. గురువారం కోడుమూరు బాలికల హైస్కూల్లో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేసుకోవడం ద్వారా తల్లులకు అనారోగ్య సమస్యలతో పాటు, పుట్టబోయే బిడ్డలకు కూడా ప్రమాదమేనన్నారు. బాలికలంతా చక్కగా చదువుకోవాలని, చదువు ద్వారానే పేదరికంపై విజయం సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాభాయి, హెచ్‌ఎం నాగరాజకుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వనిత, ఆరోగ్య కార్యకర్త లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

‘ఏటిపాయ’ కల నెరవేరేనా..?

- 1996లో వరదలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్
- గత ప్రభుత్వంలో ప్రతిపానదలు పంపిన అధికారులు
- అధికారులు, పాలకులు చొరవ చూపాలంటున్న తమ్మరాజుపల్లె ప్రజలు



శిథిలమైన శిలాఫలకం



కోతకు గురైన ఏటిపాయచెక్‌డ్యామ్ అనవాళ్లు



కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న మైనర్ ఇరిగేషన్ అధికారులు (ఫైల్)

పాణ్యం: ఏటిపాయ చెక్‌డ్యామ్ నిర్మించాలన్న మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామస్తులు ఏళ్ల తరబడి కోరిక కలగానే మిగిలింది. దీంతో రెండు కొండల మధ్య ఉన్న ఈ గ్రామానికి తాగు, సాగు నీటి సమస్యలు తప్పడం లేదు. గతంలో నిర్మించిన ఏటిపాయ చెక్‌డ్యామ్ 1996లో భారీ వరదలకు దెబ్బతినడంతో సమస్య మొదటికి వచ్చింది. బేతంచెర్ల మండలం కొండలపై నుంచి వచ్చే భారీ వరదనీటిని నిలుపుదల కోసం 1992లో ఏటి పాయపై చెక్‌డ్యామ్ నిర్మించారు. దీంతో భూగర్భజలాల పెరిగి తాగు, సాగు నీటికి కొదవలేకుండా ఉండేది. అయితే 1996లో భారీ వరదలకు ఈ చెక్ డ్యామ్ పూర్తిగా దెబ్బతింది. అప్పటి నుంచి ప్రతిసారి అధికారులు చెక్ డ్యామ్ నిర్మాణం కోసం ప్రతి పాదనలు పంపుతున్నప్పటికీ ఎలాంటి ప్రతిఫలం లేకుండా పోయింది. అధికారులు పరిశీలించడం తప్పా సమస్య పరిష్కారం కావడం లేదు. ఈ వాగు 149.47ఎకరాల విస్తర్ణంలో ప్రవహిస్తుంది. 49.09 ఎకరాల ఫారెస్టు రిజర్వ్ పొలాల్లో ప్రవహిస్తుంది. వాగు వెంట 1674.89 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. 996.37ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఈ భూములలో మొత్తం 360బోర్లు ఉన్నాయి. అయితే ఈ వాగుపై చెక్ డ్యామ్ ఉన్న సమయంలో వ్యవసాయ బోర్లకు పుష్కలంగా నీరు వచ్చేవి. ఖరీఫ్‌తో పాటు రబీ లోనూ పంటలు పండించేవారు రైతులు. ఇసుక నెలలు కావడంతో రైతులు అధికంగా కూరగాయలు, పత్తి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలు అధికంగా సాగు చేసేవారు.

తగ్గిన సాగు....

1996లో చెక్‌డ్యామ్ కొట్టుకుపోవడంతో ప్రస్తుతం బోర్లకు ఖరీఫ్‌లోనే అంతంత మాత్రంగానే సాగునీ రు అందుతుంది. దీంతో రైతులు కూరగాయాల సా గుకే పరిమితమయ్యారు. భూగర్భజలాలు క్రమంగా ఇంకిపోవడంతో చాలా మంది రైతులు బోర్లకింద ఒక్క పంట సాగుకే పరిమితం చేస్తున్నారు. అదేవిధంగా వేసవిలో తాగునీటి సమస్య ఎదురవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి నిర్వహించిన సమీక్షలో గ్రామానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా ఓహెచ్‌ఆర్‌ను నిర్మించి శాశ్వతంగా తాగు నీటి సమస్యకు చెక్ పెట్టారు. ఇక సాగుకు కూడా నీరు అందించాలంటే ఏటిపాయ చెక్‌డ్యామ్ నిర్మాణమే ప్రధానమని భావించిన కాటసాని ప్రత్యేక చొరవ చూపారు. రూ. 3.25కోట్లకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే అనుమతులు రాకపోవడంతో గ్రామస్తుల కోరిక నెరవేరలేదు.

“ ఏటిపాయ చెక్‌డ్యామ్ నిర్మించాలి



గ్రామానికి జీవనాడిగా ఉండే ఏటిపాయ చెక్ డ్యామ్ అధిక వరదల వలన కొట్టుకుపోయింది. తర్వాత చెక్‌డ్యామ్ నిర్మాణం ప్రశ్నర్థాకంగా మారింది. దీంతో ప్రజలు ఆశలు ఆవిరయ్యాయి. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రూ. 3.25కోట్లకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపానదలు పంపించారు. అనుమతులు రానికారణంగా నిర్మాణం చేపట్టలేదు. ఏటి చెక్ డ్యామ్ నిర్మిస్తే గ్రామానికి తాగు, సాగు నీటికి నీటి ఇబ్బందులు ఉండవు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఏటిపాయ చెక్‌డ్యామ్ నిర్మాణంపై దృష్టి సారించాలి.

– కోడె శేషయ్య, తమ్మరాజుపల్లె

మళ్లీ ప్రతిపాదనలు పంపుతాం

ఏటిపాయ చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం గతంలో రూ. 3కోట్లా 25లక్షలతో ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాకపోవడంతో పనులు చేయలేదు. ఇటీవల మరో మారు ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు సూచించారు. త్వరలోనే పెరిగిన అంచనాలకు అనుగుణంగా ప్రతిపానదలు పంపిస్తాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– అర్జున్‌సింగ్, ఏఈ మైనర్ ఇరిగేషన్

రోడ్డు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: వాహనచోదకులు రోడ్డు నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో కలిసి సీఐ ఆటో డ్రైవర్లుకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొందరు ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్నారని, ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న డ్రైవర్లు మాత్రమే ఆటోలు నడపాలని, యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. మహిళ ప్రయాణికులపట్ల గౌరవంగా నడుచుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అసభ్యకరంగా మాట్లాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటోలో మత్తు పదార్థాలు రవాణ చేయరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. ప్రతి ఆటోకు ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలని, డ్రైవింగ్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సీఐ సూచించారు.

ఇసుక పంపిణీ ప్రారంభం



కె.సింగవరం రీచ్‌లో ఇసుకను టిప్పర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నదీతీర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక పంపిణీ గురువారం ప్రారంభమైంది. కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె గ్రామాల రీచ్‌లలో ఇసుక తరలింపును అధికారులు ప్రారంభించారు. రెండవ రోజు 60 టిప్పర్లు, 56 ట్రాక్టర్లతో 1,393 టనున్నుల ఇసుకను బుకింగ్ చేసుకున్నట్లు వీఆర్వోలు సాయిరమణ, లింగేష్ తెలిపారు. ఇసుక కేటాయింపును ఈఓఆర్డీ సందీప్, ఏఈఓ సిద్ధు పర్యవేక్షించగా వీఆర్వోలు తిరుపాలు, శేఖర్ తరలింపు కేంద్రాల వద్ద విధులను నిర్వర్తించారు.

ప్రజల ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయొద్దు



జేసీ విష్ణుచరణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తహసీల్దార్, వీఆర్వోలు

గడివేముల: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని తహసీల్దార్ విద్యాసాగర్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కేంద్రం నంద్యాల నుంచి జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం వీఆర్వోలతో నిర్వహించిన సమీక్షలో తహసీల్దార్ మాట్లాడారు. పరిష్కార వేదికలో ప్రజలు, రైతులు సమర్పించిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, ఫిర్యాదులను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్, ఆర్‌ఐ వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కప్పేసిన కంపచెట్లు!



బస్తిపాడు దగ్గర రోడ్డుపైకి వచ్చిన ముళ్ల పొదలు



ప్రమాదకర మలుపు వద్ద రోడ్డుపై వచ్చిన ముళ్ల పొదలు

కల్లూరు: రోడ్డును కంపచెట్లు కప్పేయడంతో రాకపోకలు ఇబ్బందిగా మారింది. లక్ష్మీపురం నుంచి బస్తిపాడుకు వెళ్లే రోడ్డు వెంట ముళ్ల పొదలు ఏపుగా పెరిగి రహదారిని కప్పేశాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బస్తిపాడు గ్రామ పరిధిలోని కొండవెంట రోడ్డు మలుపు కంపచెట్లతో నిండిపోయింది. దీంతో రోడ్డు కనిపించక వాహనచోదుకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. పొలాలకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల రోడ్డు మలుపుల సూచిక బోర్డులను సైతం ముళ్ల పొదలు కప్పి వేశాయి. అధికారులు స్పందించి కంపచెట్ల తొలగింపు చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఏడీఎంఈ పదోన్నతుల జాబితాలో చోటు

కర్నూలు(హాస్పిటల్): అడిషనల్ డీఎంఈ పదోన్నతి జాబితాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చెందిన పలువురు వైద్యులు ఉన్నారు. రాష్ట్రంలోని పలు బోధనాసుపత్రుల నుంచి అర్హులైన పలువురు సీనియర్ వైద్యులతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఉన్నతాధికారులు జాబితా 2024-25 ప్యానెల్‌ను రూపొందించారు. వీరిలో అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొందిన వారిని రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బోధనాసుపత్రుల్లో ప్రిన్సిపాళ్లుగా, సూపరింటెండెంట్లుగా నియమించనున్నారు. ఈ జాబితాలో 11వ స్థానంలో డాక్టర్ కె.శ్రీనివాసులు (ఆర్థోపెడిక్స్), 12వ నంబర్‌లో డాక్టర్ సి.శ్రీనివాసులు (న్యూరాలజీ), 13వ నంబర్‌లో డాక్టర్ కె.రేవతి (అఫ్తమాలజీ), 28వ నంబర్‌లో డాక్టర్ జి.విశాల (అనెస్తీషియా), 31వ నంబర్‌లో డాక్టర్ కె.వెంకటేశ్వర్లు (ఆర్థోపెడిక్స్), 40వ నంబర్‌లో డాక్టర్ పి.శ్రీనివాసులు(ఎండోక్రైనాలజీ), 41వ నంబర్‌లో డాక్టర్ పి.రాజశేఖర్ (జనరల్ మెడిసిన్), 49వ నంబర్‌లో డాక్టర్ ఎ.రేణుకాదేవి (మైక్రోబయాలజీ), 56వ నంబర్‌లో డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి (కార్డియోథొరాసిక్ సర్జరీ), 88వ నంబర్‌లో డాక్టర్ పి.హరిచరణ్ (జనరల్ సర్జరీ), 91వ నంబర్‌లో డాక్టర్ సి.శ్రీకృష్ణప్రకాష్ (క్యాన్సర్), 101వ నంబర్‌లో డాక్టర్ ఎస్.అమీరున్నీసాబేగం (ఫిజియాలజీ), 110వ నంబర్‌లో డాక్టర్ బి.విజయానంద్‌బాబు(పీడియాట్రిక్స్), 112వ నంబర్‌లో డాక్టర్ ఎ.పద్మవిజయశ్రీ (బయోకెమిస్ట్రీ), 113వ నంబర్‌లో డాక్టర్ కేఎం.ఇక్బాల్ హుసేన్ (జనరల్ మెడిసిన్), 115వ నంబర్‌లో డాక్టర్ ఎస్.శివకుమార్ (పీడియాట్రిక్ సర్జరీ) ఉన్నారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 2వ తేదీ లోగా తెలపాలని పేర్కొన్నారు.

ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తబ్రేజ్

సి.బెళగల్: ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనాన్ని అలవర్చుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల పెద్దలతో నిర్వహించిన సమావేశానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమస్యలను పెద్దవిగా చేసుకోకూడదని, సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తినప్పుడు పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని, అప్పటికీ సంతృప్తి చెందకుంటే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రజలు ఐకమత్యంగా మెలగాలని, ఉత్సవాలు, వేడుకలు, పండుగలను కలిసి జరుపుకోవాలని సూచించారు. వచ్చే వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. పాత నేరస్తులపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

సి.బెళగల్: ఇసుకను అక్రమంగా రవాణ చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని కోడుమూరు సీఐ తబ్రేజ్ హెచ్చరించారు. గురువారం మండలంలోని కొత్తకోట గ్రామ ఇసుక రీచ్‌ను సీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌ల నిర్వహణ, పోలీస్ గస్తీ వివరాలను ఎస్‌ఐ తిమ్మారెడ్డిని సీఐ అడిగి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సి.బెళగల్, గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీస్ సిబ్బందికి రీచ్‌ల దగ్గర తీసుకోవాల్సిన భద్రతా చర్యలను సూచించారు. ఇసుకను అక్రమంగా తరలించే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలుపాలని, పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఇసుక రీచ్‌ల దగ్గర బందోబస్తుగా ఇద్దరు ఎస్‌ఐలతో పాటు గూడూరు ఏఎస్‌ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుళ్లు రామయ్య, క్రిష్ణ, చంద్రశేఖర్ ఆచారి, రంగయ్య, కానిస్టేబుళ్లు శ్రీరాములు, శ్రీనివాసగౌడు, మధుశేఖర్ ఉన్నారు.



కొత్తకోట ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సీఐ

మీదివేములకు ఎక్స్‌లెన్సీ అవార్డు

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామం జెడ్పీ హై స్కూల్‌కు క్రీడావిభాగంలో ఎక్స్‌లెన్సీ అవార్డు ప్రదానం చేశారని హెచ్‌ఎం శ్రీనివాస యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌లో పాఠశాల 5వ స్థానంలో ఎంపికైందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 29వ తేదీన కర్నూలులో నిర్వహించిన క్రీడా దినోత్సవం సందర్భంగా అవార్డును డీఈఓ చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు.

31 పింఛన్ల పంపిణీ



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: ఆగస్టు 31వతేదీనే సామాజిక పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని వర్కూరు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సెప్టెంబర్ 1వతేదీ ఆదివారం వచ్చినందున ప్రభుత్వం ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు పింఛన్లు అందజేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ప్రతి చిన్నారి బడికి వెళ్లాలి



చెంచుకాలనీలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

పాణ్యం: ప్రతి చిన్నారి క్రమం తప్పతకుండా బడికి వెళ్లాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బసరున్నిసా బేగం, అసిస్టెంట్ ఆఫీసర్ విద్యావతి సూచించారు. గురువారం సాయంత్రం పాణ్యం చెంచుకాలనీలో విద్యార్థులు, హెచ్‌ఎంలతో కలిసి వారు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తప్పకుండా తమ పిల్లలను బడికి పంపాలన్నారు. బడిఈడు పిల్లలు బయట ఎవ్వరూ ఉండరాదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఫలాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసెస్కో కో–ఆర్డినేటర్ రఘురామిరెడ్డి, సీఆర్‌పీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



గోరంట్ల గురుకుల పాఠశాలలో క్రీడాకారులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న హెచ్‌ఎం రామచంద్రారెడ్డి

కోడుమూరు రూరల్ : విద్యార్థులు విద్యతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని గోరంట్ల మహాత్మ జ్యోతి పూలే గురుకుల పాఠశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రియాజ్ మహమ్మద్ సూచించారు. స్పోర్ట్స్ డే కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గురుకుల పాఠశాలలో క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు వ్యాయమం చేయడం ద్వారా మనిషి ఆరోగ్యంగా ఉంటాడన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లోనూ రాణించాలని, క్రీడాకారుడు ఆటస్థలం నుంచి వస్తాడన్నారు. క్రమతప్పని వ్యాయామం, ధ్యానం, యోగ ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పీఈటీ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగుభాష ఎంతో గొప్పది..

భాషల్లోకెల్లా తెలుగు భాష ఎంతో గొప్పదని హెచ్ఎం అనంతయ్య తెలిపారు. గురువారం మండలంలోని అమడగుంట్ల హైస్కూల్లో తెలుగు భాషా దినోత్సవం, నేషనల్ స్పోర్ట్స్ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషాకోవిదుడు గిడుగు వెంకటరామమూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి గొప్ప తనాన్ని హెచ్ఎం విద్యార్థులకు వివరించారు.

ఘనంగా తెలుగు భాష దినోత్సవం

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు ప్రభుత్వ ఉన్నతాశాలలో గురువారం తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నారాయణ ఆధ్వర్యంలో గిడుగురామూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ వ్యవహారిక భాషను అందలం ఎక్కించిన మహోన్నతుడు గిడుదురామూర్తి అని కొనియాడారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గడివేముల: మండల కేంద్రం గడివేములలోని రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు భాషతో పాటు క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ రామేశ్వర రావు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష తల్లి లాంటిది

కల్లూరు: తెలుగు భాష తల్లి లాంటిందని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం తెలుగు భాష దినోత్సవ వేడుకలను కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ తెలుగు గొప్పదనాన్ని వివరించారు. ఎంఈఓ పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఏసుదాసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా హెచ్‌ఎం రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవంతో పాటు, తెలుగు దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూల మాలతో నివాళులర్పించారు. క్రీడారంగంలో ధ్యాన్ చంద్ చేసిన సేవలను స్మరించుకున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి



డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): డబ్బే పరమావధిగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య, బీసన్న, జిల్లా కార్యవర్గసభ్యులు రాజు, చంటి గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో కావేరి అనే చిన్నారికి డెంగీ జ్వరం సోకడంతో ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయాల్సి ఉన్నా డబ్బులు కట్టించుకున్నారని, చివరికి ఆ పాప మరణించిందన్నారు.అలాగే ఎస్ఆర్ పేటలోని యశోదా హాస్పిటల్‌లో డాక్టర్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు చెందిన మాదవి ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. ఈ మరణాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.